# నిక్షిప్తం

"చావులమదుం దిగాలెయ్!"

కండక్టరు లోపలనుంచి కేకవేశాడు. చెక్కరు కిందికి దిగి డబ్బులు వసూలు చేసుకుంటున్నాడు.

బస్సుకు నాలుగు బారల దూరంలో ఉన్న సిమ్మెంటు దిమ్మ మీద ఓ వ్యక్తి కనిపించాడు. లేచి కూచుని విపరీతంగా డోక్కుని వాంతి చేసుకుంటున్నాడు.

బస్సు నుంచున్న రెండు నిముషాల్లోనూ మూడుసార్లు చూడడానికి కష్టమనిపించింది.

కింద ఈగలు సామ్రాజ్యం చేస్తున్నాయ్. అతని ముఖంమీద ఈగలు. తాగుబోతని స్పష్టంగా తెలుస్తోంది.

ఆశ్చర్యకరమైన దృశ్యం. "మావా?" ఓ అమ్మాయి వచ్చింది. చేతిలో జర్మన్ సిల్వర్‌గిన్నె పట్టుకుని.

ఆ దిమ్మ ఓ సంసారానికి కేంద్రం. ఐదు గజాల దూరంలో పన్నెండడుగుల ఎత్తైన రైలులైను. కింద కొన్ని సంసారాలు.

ఆ తాగుబోతుకి ఈ అమ్మాయి ఏం కావాలి? మరదలా? భార్యా? ఉంపుడుకత్తా? ఆమె కంఠంలోని మృదుత్వం నేనెక్కడా, ఎప్పుడూ వినలేదు.

తల అడ్డంగా ఊపి మళ్ళీ నడుం సిమ్మెంటు దిమ్మమీద జారవేశాడు. నేనొక చిత్రకారుణ్నయితే బాగుణ్ననుకున్నాను. రాయ్ ఛౌదురీ అతని కుంచెతో ఆ అమ్మాయినీ, ఆ తాగుబోతునీ తైల వర్ణాలలో శాశ్వతంగా పదిలపరిచే వాడు.

అసలు మనిషి ఎందుకు తాగాలి? తాగుబోతులందరికీ వాంతులు చేసుకుంటున్న దృశ్యాలు చూపిస్తే!

"నాన్సెన్స్! సుఖవ్యాధులతో పుచ్చిపోయిన శరీర భాగాల ఫోటోల్ని వేశ్యాగృహాల్లో వేలాడదీయించినా వాటి ఇంపాక్ట్‌జీరో" అనేశాడు, చిరకాల మిత్రుడూ, నాహోస్టూ, నేను చచ్చినంత కల కాశాక.

నేను సాయంకాలం ఇంటికి వెళ్ళేసరికి మిత్రుడు ఇంట్లో లేడు. రాత్రి భోజనం చేస్తూ అడిగాను మిత్రుడి భార్య సుషమని రోజూ ఆలస్యంగానే వస్తాడా?

ఒక్క రోజు కూడా రాత్రి సరైన వేళకు భోజనానికి రాడని సుషమ చెప్పింది.

భోజనం చేసి మిత్రుడి షెల్ఫ్‌లో కనిపించిన ఎనాలిసిస్ పుస్తకం తిరగేస్తూ పడుకున్నాను నాకని ప్రత్యేకించిన గదిలో.

తలుపు తీసిన శబ్దం వినలేదు కాని బాత్‌రూమ్‌లో బొళ్లున వాంతి చేసుకుంటున్నాడు కరుణ. రెండు నిముషాలు నాకు కడుపులో తిప్పినట్లయింది.

ఒక్కొక్క నిమిషం యుగంలా ఉంది. ఇంకా కష్టంగా డోక్కుంటున్నాడు. నాకు గుండెలు దడదడ లాడిపోయాయి. సుషమ బాధతో కడిగేస్తోంది బాత్‌రూమ్.

కరుణ తాగుబోతయ్యాడా? అసలీ మృత్యుదేవత నెందుకు అంతగా ప్రేమిస్తున్నారు, ఆరాధకులు?

దాహం వేస్తోంది. గది బయట వరండాలో మంచినీళ్ళు కూజా ఉంది. కాని బయటకు రావడానికి బెరుకుగా ఉంది.

సుషమ సహనానికి ఆశ్చర్యపోయాను. పల్లెత్తుమాట వినపడలేదు. ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. పండంటి బిడ్డ. పండులాంటి సంసారం. వీడికిదేం రోగం? విలవిల్లాడిపోయాను.

మెల్లగా బయటకు వచ్చి నీళ్ళు తాగాను. కరుణ గదిలో చీకటి. కదలకుండా పడుకున్నాను. నేను మేలుకున్నట్టు తెలిస్తే వాడు బాధ పడతాడని నా ఆరాటం. మరి కొంతసేపు గడిచింది. బాత్‌రూమ్‌లోకి వెళ్ళాలనిపించింది. చాలాసేపు తటపటాయించి బయటకు వెళ్లాను.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. నేను లేచేసరికి బాబీ నా మంచం దగ్గర నుంచుని నావంక చూస్తున్నాడు.

"అంకుల్! కాఫీ తాగుతారా?"

"లేస్తున్నా బాబూ."

నేను రెడీఅయి కాఫీ తాగేశాను. కరుణ గది తలుపు వేసేవుంది. నేను మౌనం వహించాను. ఎనిమిదయ్యాక కరుణ లేచి చకచకా తయారై బయలుదేరబోతూ అడిగాడు.

"సింహాచలం దర్శనం బాగా అయిందా?"

"ఆఁ...నీతో మాటాడాలి-" నా వంక చూసి "సాయంకాలం క్లినిక్ రా, అలా బీచికి పోయి కులాసాగా మాటాడుకుందాం" వెంటనే వెళ్ళిపోయాడు. అలా తిరిగివచ్చి నేను మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్నా మళ్ళీ నాలుగయ్యాక మెళకువ వచ్చింది.

"మంచి నిద్ర పట్టేసినట్టుంది. ఎదురింటి వాళ్ళ కారు షెడ్‌లో ఎన్ని చప్పుళ్ళు చేశారో, మీకు మెలకువే రాలేదు."

సుషమ అలా అనడంలోని ఆంతర్యం నాకు వెంటనే అవగతమైంది. గత రాత్రి జరిగిన గొడవ నాకు తెలియదనే ఆమె ఉద్దేశ్యం.

"నాకు నిద్ర పట్టేస్తే అంతే, భూకంపం వచ్చినా మెళకువరాదు" అనేశాను.

కరుణ క్లినిక్ బయట వరండా హడావుడిగా ఉంది. చాలామంది వెయిట్ చేస్తున్నారు. నేను కొంచెంసేపు వెయిట్ చేశాక తన అసిస్టెంటుకి ఆస్పత్రి అప్పచెప్పి కరుణ నన్ను సన్ అండ్ సీకి తీసుకెళ్లాడు. లాన్‌లో కాఫీ తాగాం. వెనక ఇసక దిబ్బమీద సముద్రాని కెదురుగా కూర్చున్నాం.

ఎర్రని సాయంకాలం.

"ఏరా, అంత మౌనంగా ఉన్నావ్?"

"విచారం."

"దేనికో?"

"సిగ్గులేదూ అడగడానికి. పదిమందికి మంచి నడవడి చెప్పవలసిన పవిత్రమైన వైద్యవృత్తిని చేపట్టి నీకు తాగుడేమిటి?"

ఉప్పెనలా సాగిపోయింది నా హితబోధ.

"వేడి కాఫీ తాగావ్! ఒళ్లంతా చెమటలు పట్టేశాయ్. కాస్త శాంతించు."

"తాగుబోతు వాళ్ళకు సిగ్గూ, లజ్జా కూడా ఉందన్నమాట."

"నేను తాగడం చూశావా?"

"లేదు నిన్న రాత్రి...తప్పతాగి వచ్చి...గుండెలదిరేలా వాంతి చేసుకున్నావ్...ఏం అలా చూస్తున్నావ్?"

"నిన్ను నమ్మించడం ఎలా? ఆలస్యంగా ఇంటికి వచ్చిన మాట నిజమే కాని నేను తాగనూ లేదు కక్కుకోనూ లేదు. ఇది నమ్ము. నమ్ముతానంటే మిగిలిన సంగతి ఆలోచిద్దాం."

నాకు మరోసారి చెమటలు పట్టేశాయి.

నేను మాట్లాడేవరకూ కరుణ నన్ను మాట్లాడించలేదు.

"అయితే కలకన్నానేమో!"

"పాసిబుల్...సింహాచలం యాత్ర బాగా అయిందా?"

పిచ్చాపాటీలోకి దింపడానికి ప్రయత్నం చేస్తున్నాడని అర్థమయింది.

"యాత్ర బాగానే అయింది కాని... నిన్న రాత్రి..."

"నేను నిన్ను నమ్మించలేనని చెబుతున్నానుగా. పోనీ నేనడిగే ప్రశ్నకి సమాధానం చెప్పు. నిన్న నిద్రపోయే ముందు ఏదైనా గుండెలకు హత్తుకునే సంఘటన చూశావా?"

"చూశా. పద చెబుతా!"

దోవలోనే చూసిన దంతా చెప్పాను. ఆ అమ్మాయీ, ఆ తాగుబోతూ, ఆ సిమ్మెంటు దిమ్మా, చావులమదుం...

"చావులమదుం దగ్గరకు పద." చావులమదుం జంక్షన్ దగ్గర కుడిచేతివైపు టర్నింగ్ తిప్పి రైల్వే స్టేషన్ రోడ్డుమీద కొంత దూరం వెళ్ళాక కారు ఆపాడు కరుణ.

ధైర్యంచేసి ముందుకి నడిచాను. సిమ్మెంటు దిమ్మ దగ్గరకు వెళ్లాను. మురికి కూపం, జుమ్మని ఈగలు. రొచ్చు వాసన.

" ఏ యమ్మోయ్!" కేక వేశా ఓ అయిదు గజాల దూరం నుండి.

"ఎవరు బాబూ, ఏం కావాలి?"

"ఇక్కడ నిన్న సుమారు ఈ వేళప్పుడు ఒకతను వాంతి చేసుకుంటూ ఉన్నాడు. అతనెక్కడ?"

"కిరాయి కెటూ ఎల్లకపోతే టేండు కాడుంటాడు టేసన్ టొండుకాడ. ఆడితో నీకేటి పని?"

"అతనికి తాగుడు ఎన్నాళ్ళ నుంచి అలవాటు?"

"ఏం సెప్పను. అదో పెద్ద కత! అన్నేయం జూడనేడు. అన్నేయం చెయ్యనేడు, కూసింత సదువుకొన్నాడు."

అంత సదుకున్నందుకు ఉద్యోగం చెయ్యవల్సింది. ఆ షావుకారుతో దెబ్బనాడి దొంగతనం కట్టించుకుని జెయిలు కెళ్ళి ఇలా అయిపోనాడు. ఇజీనారంలో మా ఇంటి పక్కనుండేవాడు. ఎవరూ లేరు బాᐟవూ! మా అమ్మఅయ్య సచ్చి నేనేడుత్తా ఉంటే నన్నెంటుకొచ్చీసివాడు. అయినా ఏదో పరాకు. నా కోసం తాగడం మానేస్తానన్నాడు. మానేసినాడు. కాని ఆడు తాగినప్పుడే నాకు బావుంటుంది బాᐟవూ. మానేసి బైరాగై పోయాడు. పన్జెయ్యడు. రెండో మూడో సంపాయించి తరవాత పులిబోను ఆడుతా

కూకుంటాడు. మనిసి మంచోడు బాఁవూ! కాని ఆడితో మీకేటి పని?

"సొంత రిక్షాలు తగిన వాళ్ళకు ఇవ్వాలని..." ఠక్కున సమాధానం చెప్పాడు కరుణ.

ఆ తరవాత స్టేషన్‌స్టేండు దగ్గరకు వెళ్లాం. కరుణ కారులోనే కూచున్నాడు. "బైరాగెవరు?" అడిగాను.

లేచి నుంచున్నాడు. నిన్న నేను చూసిన మనిషి. పక్కకు తీసుకు వెళ్ళాను.

"నిన్న నువ్ వాంతి చేసుకోడం చూశాను. నీ గురించి తెలుసుకోవాలనిపించింది. నీ భార్య..."

"అంత మాటనకండి బావూ!" అతని ముఖంలో ఉదాసీనత నీలాకాశంలో నల్ల మబ్బులా క్షణంలో కమ్మేసింది. కరుణ అతని కళ్ళల్లోకే చూస్తున్నాడు.

"ఏం?"

"అదంతా ఓ కత. సేన్నాళ్ళ కింద ఆళ్ళ నాన్నా, నేనూ పక్క పక్క గుడిసెల్లో ఉండేవోళ్ళం. ఆడు రికసా లాగేవాడు. ఓ నాడు రేత్తిరి ఆడు తాగీసొచ్చి ఇంటి ముంగిలే పడిపోనాడు. ఆల్లమ్మ గొల్లుమని నాకాడ కొచ్చింది. నా గుండె కరిగిపోనాది...బావూ...నాబాధ మీకరదం కాదు. దీని తల్లి అప్పటివరకూ పిల్లల్లేనిది నెల తప్పింది. ఆడు తాగడం మానేసినాడు...ఇది పుట్టింది వయసొత్తానే ఉంది. ఇది పెద్దదైన తరవాత ఇద్దరూ సచ్చిపోనారు. దీన్ని తీసుకొచ్చేసినాను. నేను పాపిట్టోణ్ణి బావూ...దానికి నా బాధెలా తెలుస్తాది? దానికి పెల్లి సెయ్యాలనే ప్రయత్నం. ఆ ఊసెత్తినప్పుడల్లా నీకంటె నాకెవరు మావా అంటాది. నాకు మతి పోతాది. తాగక తప్పదు...నా పాపానికి ఏటిసిచ్చ!"

బైరాగి కళ్ళు తుడుచుకున్నాడు.

కరుణ జేబులోంచి రెండువందల కాగితాలు తీసిచ్చాడు.

"బైరాగీ జరిగిన దానికి విచారించి ఏం ప్రయోజనం? నీ చేతుల్తో దానికి పెళ్ళి చేసెయ్యి. లేకుంటే నూతిలో దూకుతానని బెదిరించు. ఏదో చెయ్యి. అప్పుడే నీకు మనశ్శాంతి."

మేం నేరుగా ఇంటికి వెళ్ళలేదు. ఆస్పత్రి కెళ్ళాం.

"తీరికగా కొన్ని ప్రశ్నలడుగుతా, సమాధానం చెప్పు." కుర్చీ ఎదురుగా కూచున్నాడు.

"మీ నాన్నగారు ఎలా పోయారో నీకు తెలుసా?"

"లివర్ జబ్బు...అప్పటికి నాకు పదమూడేళ్ళేగా."

"రైట్! నీ మనసులో నిక్షిప్తంగా ఓ బాధ నిన్ను వెంటాడుతోంది. దానికి కారణం నేనూహించగలను. నిన్న రాత్రి నీకు కలిగింది ఒక చిత్రమైన భ్రాంతి నిన్న సాయంకాలం ఐదు తరువాత నేనేం చేశానో వెంకట్రావ్ చెబుతాడు విను. సీతమ్మ ధార దగ్గర ఓ పురిటి కేసులో రాత్రి పన్నెండు వరకూ ఇద్దరు కలిసి పనిచేశాం. అది తరవాత ఋజువు చేస్తా, మీ నాన్నగారు వాంతి చేసుకోవడం ఎప్పుడైనా చూశావా?"

"లేదు."

"ఇమీడియట్ మెమరీలో లేక పోవచ్చు. డీప్ మెమరీలో ఉంది. మనసు చావుల మదుంలాంటిదే. అందులో నిక్షిప్తంగా పొరలు పొరలుగా లోతుగా స్మృతులు పేరుకుని పోయి ఉంటాయి. నిన్న చూసిన దృశ్యం నీ మనసులోని ఙ్ఞాపకాన్ని కదిపింది. పొరలన్నింటినీ ఛేదించుకుని బయటకు పెల్లుబికింది. ఈ పూర్వస్మృతి అందుకే ఈ విషయం అంతా నీకు విడమరిచి చెప్పాను-ఇక ఆ బైరాగి గురించి

ఆలోచించకు. ఆ బైరాగి బాధలో మీ నాన్న బాధని తిరిగి చూసినట్టు అనుభవించావ్. అదే కలలా వచ్చింది. నా మీద గాఢమైన అభిమానం నీకుంది. మీ నాన్న చనిపోయింది సిరోసిస్ ఆఫ్ ది లివర్ వల్ల తాగుడు ఎక్కువై వచ్చే జబ్బు అది. అప్పుడు నాకు తెలియదుగా. చదువుకున్న తరవాత తెలిసింది...ఇక ఆ బైరాగి సంగతి ఆలోచించకు."

కరుణ కారు గారేజీలో పెడుతుంటే రెండేసి మెట్లెక్కి లోపలికెళ్ళి సుషమనడిగాను. నిన్న రాత్రి కరుణ భోజనం **చేశాడా?**

"**చెయ్యకేం, నిక్షేపంలా చేశారు**. చల్లారినా, రుచిగా లేకపోయినా ఆ బాధలేం లేవాయనకి. నా అదృష్టం."

"ఏమిటో **అదృష్టం** అంటున్నావ్? కరుణ లోపలికొచ్చాడు.

"**నాకు ఆకలేస్తోంది!**" అని నా గదిలోకి వెళ్ళిపోయాను.

యువరాణి జూన్ 1976